**Eenadu**

# కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాతే ఉపాధ్యాయ నియామకాలు

- **సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్**

ఈనాడు, హైదరాబాద్: కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత పూర్తి స్థాయిలో పని చేయడం మొదలు పెట్టిన అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలను (టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్టు - టీఆర్‌టీ) చేపడతామని తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు ఈనెల 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ అఫిడవిట్ దాఖలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ఖాళీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పీఎస్, పీఏలుగా ఉపాధ్యాయులు పనిచేయడం తదితర అంశాలపై సుప్రీం కోర్టులో కేసు విచారణలో ఉన్న సంగతి తెలిసిందే. సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో అఫిడవిట్ దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటైన తర్వాత మాత్రమే టీఆర్‌టీ చేపడతామని హామీ ఇచ్చింది. ఉపాధ్యాయుల నియామకాలు జిల్లా యూనిట్‌గా జరుగుతాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 80 శాతం పోస్టులు స్థానికులకు, 20 శాతం ఓపెన్ కేటగిరీ కిందకు వస్తాయి. అందువల్ల కొత్త జిల్లాల తర్వాతే భర్తీ చేపట్టాల్సి ఉంటుంది. పలుఉపాధ్యాయ సంఘాలు సైతం ఇందుకు సుముఖతవ్యక్తం చేశాయి.

**వివిధ కొలమానాలను పరీక్షించాలి:** పాఠశాలల్లో నాణ్యత, నిర్వహణలపై సుప్రీంకోర్టుకు మరో అఫిడవిట్ సమర్పిస్తూ ప్రస్తుతం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి బహుళ ఐచ్ఛిక ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తున్నామని, అయితే వివిధ నాణ్యత కొలమానాలను పరీక్షించి ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. వివరణాత్మక పరీక్ష (డిస్క్రిప్టివ్ టెస్టు), ఆ తర్వాత తరగతి బోధన నైపుణ్య ప్రదర్శన అవసరమని. ఈ క్రమంలో టీఆర్‌టీలో పాల్గొనేందుకు టెట్ ప్రాథమిక పరీక్ష (స్క్రీనింగ్) గా ఉపయోగపడుతుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు కిషన్ పేర్కొన్నారు.